

# మనిషి ఒంటరి.. మనిషే సమూహం

మనిషి ఒంటరి.

మనిషి సమూహం.

ఆకాశం ఒంటరి.. కాని ఆకాశం ఒక సమూహం.

భూమీ ఒంటరే.. కాని భూమి సకల జీవ, నిర్జీవ చరాచర వస్తు పదార్థ సంచయంతో నిండిన ఒక సమూహం కూడా.

ఆ కోణంలో ప్రతి పక్షీ, పశువూ, చెట్టూ, గుట్టా అన్నీ ఒంటరే.. కాని సూక్ష్మదృష్టితో చూస్తే ఏదీ ఒంటరి కాదు. ప్రతిదాని చుట్టూ ఆవరించి ఇక దృశ్యాదృశ్య వ్యవస్థ విస్తరించి సంకలితమై ఉన్నాయి ఒక అంతస్సంబంధంతో. చూడగలగాలి.. గమనించగలగాలి. గ్రహించగలగాలి. స్వీకరించగలగాలి.

ఏది స్థూలం.. ఏది సూక్ష్మం.

ఏది ఒంటరితనం.. ఏది సమూహం..

చిన్నప్పటినుండి ఎన్నోసార్లు గమనించింది తను.. ఒంటరి చీమను.. సమూహంగా వరుసగా ఒక నియమిత క్రమశిక్షణతో సమూహంగా సాగిపోయే చీమల దండును.

నిజానికి మనిషి పుట్టినప్పుడు పూర్తిగా ఒంటరే.. తర్వాత్తర్వాత.. ఒక్కరొక్కరు.. తల్లి, తండ్రి.. తోబుట్టువులు.. బంధువులు.. ఒక సమూహం.. డెండ్రైట్.

ఒక స్త్రీ ఎదుగుతూ ఎదుగుతూ.. క్రమ క్రమంగా మళ్ళీ తనకు తెలియకుండానే తాను ఒంటరిగా మారుతూ.. అదృశ్య పరివర్తన.. భౌతికంగా ఉన్న బంధాలను తెంచుకుంటూ.. పెళ్ళి పేరుతో కొత్త మనుషులు, కొత్త ఆవరణ.. కొత్త జీవితం.. సమూహం మారుతుంది. పరిస్థితులు మారుతాయి.. జీవన వ్యవస్థ మారుతుంది.. కలిసి వెంట నడిచే పాదాలు మారుతాయి. సాహచర్యం.. సహ గమనం.. సహ యాత్ర.. సహ సహకారం.. ప్చ్.

'కాలాన్ని క్రీస్తు పూర్వం.. క్రీస్తు శకం' వలె మనిషి జీవితాన్ని 'పెళ్ళికి పూర్వం, పెళ్లి తర్వాత అని పరిగణించి చూడాలి' అని ఎవరో సాహిత్యకారుడన్నట్టు.. నిజమేనేమో.

ఆడదైనా, మగాడైనా జీవితం ఊహాతీతమైన పెనుమార్పులకూ, ఒక అకస్మాత్ కల్లోలానికీ గురై కొత్త దారిలోకి మళ్ళి సాగిపోయేది పెళ్ళి తర్వాతే.

పెళ్ళికి ఇవతల.. పెళ్లికి అవతల.

రెండు ప్రపంచాలు. కన్ను మూస్తే తనలోనే ఒక ప్రపంచం. కన్ను తెరిస్తే ఒక ప్రపంచంలో తను.

ఘర్షణ.. నిరంతరమైన అనంత సంఘర్షణ. ఎడతెగని ఘర్షణ. వ్యక్తిత్వ ఘర్షణ, తత్వ ఘర్షణ, అభిరుచుల వైరుధ్యాల ఘర్షణ, లక్ష్యాల ఘర్షణ.. చివరికి ఘర్షించీ ఘర్షించీ అలసి మౌనమై, కన్నీరై, ఓడిపోతూ నిస్సహాయంగా మిగిలిపోతూ.. అవశేషంగా ఒట్టి నిశ్శబ్దమై, గడ్డకడ్తూ రోజురోజుకూ ఇంకా ఇంకా మిగిలిపోతూ అసలు మాటలే పెగలని ఘనీభవించే నిశ్శబ్దం.

ఆ సాయంత్రం.. ఒంటరిగా గోదావరినది ఒడిలో.. ఒంటరి ముతక పడవలో వెల్లకిలా పడుకుని ఒక పావుగంటనుండి అలా నిశ్చేష్టయై ఆకాశంలోకి తల్లి కన్నుల్లోకి చూస్తున్నట్టు పుట్టెడు దుఃఖంతో, ఆర్ద్రతతో చూస్తూ ఉన్న అరుణ ఒక చల్లని గాలితెప్ప స్పర్శతో తేరుకుని మెల్లగా లేచి కూర్చుంది. చుట్టూ చూచిందొకసారి. అంతా ఒట్టి నిశ్శబ్దమే. ఎక్కడా ఏ అలికిడీ లేదు. మనిషిలో కనిపించక వినిపించక ఒట్టిగా ధ్వనించే ప్రాణ సవ్వడిలా.. గోదావరి నిశ్శబ్ద నీటి మౌనధ్వని.

ఒక పక్షి ఏదో రివ్వున శబ్దిస్తూ దూసుకుపోయింది.

దూరంగా అస్తమిస్తూ ఎర్రగా.. రౌద్ర సూర్యుడు.

కింద ఏటు చూచినా విస్తరించి గోదావరి నీరు.. నీలిగా. దూరంనుండి తన పడవలో తనవైపే వస్తూ రాములు మెల్లగా.

వెళ్ళాలిక తను.

ముందే మాట్లాడుకున్న విధంగా రాములు తనను ఒక గంట క్రితం ఒడ్డు నుండి తీసుకువచ్చి ఈ లోపల ఉన్న ఇసుకమేట లంకపై విడిచిపెట్టి వెళ్ళాడు. నూరు రూపాయలు. ఒక గంట తర్వాత వచ్చి తనను మళ్ళీ ఒడ్డుకు తీసుకుపోవాలి. అదీ ఒప్పందం.

అప్పటిదాకా ఎక్కడో నది పైననే చేపలు పట్టుకుంటూ గడిపినట్టున్నాడు రాములు. కనబడనే లేదు.

మనిషికి నిజమైన ఒంటరితనం దొరకడం ఎంత కష్టమో.

ఒక గంటనుండి తను పూర్తిగా నికార్సైన నిశ్సబ్ద మాధుర్యాన్ని అనుభవించింది. చాలా ఏళ్ల తర్వాత.. దాదాపు పదేళ్ల అనంతరం. పంజరంలో నుండి పక్షి విముక్తమైన ఆనందం.. జైలు ఊచలనుండి మనిషి బాహ్య ప్రపంచంలోకి అడుగిడుతున్నప్పటి ఆనందం. మరో కొత్త జన్మెత్తి అప్పుడే కళ్ళు తెరుస్తున్నట్టు ఆనందం.

అరుణ తన ప్రక్కనే ఉన్న కొత్త మట్టిముంత దిక్కు చూచింది. ఎర్రగా కాలిన మట్టిరంగు. పైన మూతికి కట్టిన ఎర్రని పట్టుబట్ట. గొంతు దగ్గర పచ్చని పసుపుతాడు. లోపల జయరాం చితాభస్మం.. అస్థికలు. జీవించినంత కాలం అహంకారంతో, అజ్ఞానంతో, మితిమీరిన మదంతో, ఏదీ శాశ్వతం కాని ఈ మానవజన్మలో అన్నీ శాశ్వతమే అన్న వింత భ్రాంతిలో బతికి బతికి చివరికి పిడికెడు బూడిదగా మిగిలిన జయరాం.. ఇప్పుడు ఒక అవశేషమై.. తన చేతిలో.

అది వికారమో, అయిష్టతో, విముఖతో.. ఇవేవీ కాని ఒక యాంత్రిక మానవధర్మంతో నిండిన శూన్యతో అర్థంకాని నిర్లిప్తతతో ఆమె ఆ అస్థికల ముంత మూత గుడ్డను విప్పింది. లోపల సగంకంటే ఎక్కువగా బూడిద తెల్లగా. అక్కడక్కడ పేళ్లు పేళ్లుగా కాలిన బొమికల ముక్కలు. ఎలక్ట్రికల్ క్రిమిటోరియం వాళ్లు పదిలంగా ఇచ్చిన నిమజ్జన సామగ్రి.

ఒళ్ళు జలదరించిదామెకు.

దాదాపు ఎనిమిదేళ్ళ కాపురం. ఎనిమిదేళ్ళ దుస్స్వప్నం.. ఎనిమిదేళ్ళ సర్పపరిష్వంగం. ఎనిమిదేళ్ళ హింస. ఎనిమిదేళ్ళ అవమానాలు. ఎనిమిదేళ్ళ మౌనరోదన. నిస్సహాయ క్షోభ.

'యథా యథాహి ధర్మస్య.'

ధర్మం తనంతట తాను తన ధర్మాన్ని నిర్వర్తిస్తూ పోతుందా? కర్మలూ, పాప పుణ్యాలూ, ప్రవర్తన ఫలితాలూ, అంతిమంగా నిష్కృతులూ ఉంటాయా?.

అరుణలో ఏ భావమూ లేని ఒక నిర్వికార రిక్తానుభూతి విస్తరించింది శరీరమంతా. చాలా యాంత్రికంగా.. జయరాం అనే ఆ మరణించిన వ్యక్తివల్ల భార్యగా తనకు సంక్రమించిన 'కారుణ్య నియామక' ఉద్యోగం.. అన్న కృతజ్ఞతా భావంతో మాత్రమే కించిత్ సహానుభూతితో ఆ చితాభస్మాన్ని గోదావరి జలాల్లోకి వంపింది. తెల్లగా కొంత బూడిద పొడి.. జలజలా జారి.. నీళ్లలోకి అదృశ్యమైపోతూ, ప్రక్కనే ఒక ప్లాస్టిక్ సంచిలో తెచ్చుకున్న కొన్ని ఎర్రని గులాబీపూలు.. బంతిపూలు.. కొన్ని తెల్లని మల్లెపూలు.. వాటిని సాటి మనిషిగా నీళ్ళు రాని కళ్ళతో శ్రద్ధగా నీటిలోకి వదిలింది. అనాలోచితంగానే ఆమె చేతులు రెండూ ముకుళితమై నీటిలోకి ప్రవహిస్తూ పోతున్న ఆ పూలతెప్పకు నమస్కరించింది.

తర్వాత.. అంతా నిశ్చేష్ట.

ఊర్కే అలా చూస్తూ కూర్చుండిపోయింది కాస్సేపు.

అంతా నిరామయంగా.. నిసర్గంగా.. ఒక రకమైన నిర్వాణ దశ.

రాములు పడవ వస్తోంది వస్తోంది దగ్గరగా. అతని వెనుకే చూస్తూ చూస్తూండగానే లోపలికి కుంగిపోతూ ఎర్రని నిష్క్రమిస్తున్న సూర్యుడు.. ప్రక్కనుండే సన్నని పొగమంచులా అన్ని దిక్కులనుండీ ముంచుకొస్తూ చీకటి. అంతా వెరసి ఒక అద్భుతమైన ఉద్విగ్న సాయంసంధ్య.

'జయరాం అటు చూడు.. పడమట సూర్యుడు ఎంత అందంగా భూమి కౌగిలిలోకి జారిపోతున్నాడో' అంది తనా సాయంత్రం పెళ్లైన కొత్తలో జయరాం వాళ్ల ఊరు భూదేవిపేటకు వెళ్ళినపుడు ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ.. పరవశించి పోతూ. పెళ్ళి తర్వాత అప్పుడప్పుడే అతనికీ, తనకూ మధ్య కొంచెం కొంచెం సాన్నిహిత్యం పెరుగుతూ ప్రతిదానికీ అతను అన్నీ వక్రమైన, హేళనతో కూడిన అపహాస్యపూరిత ప్రతిస్పందనలతో ఆశ్చర్యమూ, భయమూ కలిగిస్తున్న సమయం

అది. చటుక్కున అన్నాడు "నువ్వెప్పుడైనా ఆ సూర్యునిలా ఎవరి కౌగిల్లోకైనా జారిపోయావా ఇదివరకు" అని. బెదిరిపోయి షాకయ్యింది తను. భయంగా బేలగా అతని దిక్కు చూస్తూంటే అతను తనెన్నడూ మరిచిపోలేని విధంగా అతి వికృతంగా నవ్వాడు పకపకా.

శాడిస్ట్.

ఇక అప్పటినుండి మొదలయ్యింది అతనిలో రోజు రోజుకూ మెల్ల మెల్లగా బయటపడ్తున్న వికారమైన పడకగది చర్యలు, మాటలతో హింస, అందమైన తనను ప్రతి క్షణం అనుమానించడాలు.. అప్పటిదాకా తన పుట్టింట అపురూపంగా నేర్చుకున్న అద్భుతంగా పాటలు పాడడం, నాట్యం చేయడం, సాహిత్యపరంగా మంచి మంచి పుస్తకాలు చదవడం.. అన్నీ హుష్ కాకి. అన్నింటిపైనా నిర్బంధమే. అన్నీ "వీల్లేదు.." "నోర్ముయ్" హుకుంలే. ఎదిరిస్తే ఆ రాత్రి ఒళ్ళు హూనం. కొట్టుడు. హింస.

మనిషి నల్లగా ఎలుగుబంటు. దానికి తోడు రాతి శరీరం. బండ. మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో కీలకమైన పర్మిషన్స్ ఇచ్చే సెక్షన్. విపరీతమైన లంచాలు. ప్రతి రోజూ ఎవడో ఒకడు పీకలదాకా తాగిస్తాడు ఫ్రీగా. రాత్రి ఏ పన్నెండు తర్వాతో తూలుతూ దాదాపు అపస్మారక స్థితిలో ఇంటికి రాగానే ఒక ఎలుగుబంటు పైన బడ్డట్టు కుమ్ములాట. తర్వాత ప్రక్కన ఓ నల్లని రాతిగుట్ట గురక. ఇక అంతే.

'ఇక ఈ జీవితమింతేనా' అని మొట్టమొదటిసారిగా ప్రశ్న.

అర్థమైపోయింది తను ఒక ఊబిలో కూరుకుపోతున్నదని. జీవితం ధ్వంసమై ఛిన్నాభిన్నం ఐపోతున్నదని.

చనిపోయిన అమ్మ జ్ఞాపకమొచ్చేది ప్రతిరోజూ. ఒంటరిగా మిగిలిన ఒక్కగా నొక్క తనను ఎలాగో ఒకలాగు వదిలించుకుని మరో పెళ్ళి చేసుకోవాలని నాన్న పడే తొందర.. అంతా పైన బొంతపురుగు పడ్తే కలిగే అతి వికారమైన అనుభూతి.

"చదువుకుంటా.. ఎస్.డి.ఎల్.సిలో ఎమ్మే" అంది తను ఒక రోజు రాత్రి పక్కలో ఉన్నపుడు. అప్పుడైతేనే వింటాడు వాడు. తెలుసు తనకు.

"అవసరమా చదువు మనకు.. దండుగ.. బోలెడు పైసలు మనదగ్గర లంచాలతో. ఎందుకు చదువు.. ఐనా ఎస్.డి.ఎల్.సీ అంటున్నవు కదా.. క్లాస్‌లకు

పోవుడుండదు. ఎవడూ నిన్ను చూసుడు కొరుక్క తినుడుండదు.. కదా.. ఓకే" అన్నాడు.

ఎం.ఏ.. చేస్తున్నప్పుడు ప్రతిరోజూ నరకమే.. వారం వారం ప్రత్యేక తరగతులకు పోతే కాపలా.. వెనుక నిఘా. కోటి అనుమానాలు. వెకిలి ప్రశ్నలు. వాకబు చేయడాలు.

ఏడాది.. రెండేళ్ళు. క్షోభ పెరిగింది. మాట మాటకు కొట్టుడు.. కావాలని ఒక రకమైన ఆత్మన్యూనతాభావంతో కావాలని శారీరకంగా హింసించడం. మానసికంగా బలహీనపరుస్తూ ఒక రకమైన విషాదానందాన్ని పొందడం. అప్పుడు బయటపడింది. జయరాంకు 'ఓజో స్పెర్మా' అని. స్పెర్మ్ కౌంట్ అతి తక్కువ. పిల్లలు కలిగే అవకాశం లేదు. ఇక జీవితమంతా గొడ్రాలు తను.

కాళ్లకింది భూమి బద్దలౌతున్న అనుభూతి. దిక్కు తోచని నిస్సహాయత. కుటుంబపరంగా ఎవరూ లేని అనాథ స్థితి. ఏకాకితనం.

ఏమిటి చేయడం..వాట్ నెక్స్ట్. తర్వాత ఏమిటి?

ఆత్మరక్షణ.. నిరర్థక దాడి తనపై జరిగి హింసిస్తున్నపుడు ప్రతిఘటన.. ఎదురు దాడి. తిరుగుబాటు.

"ఎం.ఫిల్ చేస్తా."

"వద్దు."

"చేస్తా."

"వీల్లేదు."

"ఉంది".. తర్వాత చెంప చెళ్ళు.. తన చేతిలో జయరాం చొక్క గల్లా. మరో దెబ్బ వీపుపై. మరుక్షణం వాడి చెంప చెళ్ళు.. చేతిని కొరికి కండను పీకుట. "చెప్పుకో పో ఎవ్వడితోనైనా నీ ఇష్టమున్న చోట" అని ఆడపులి హూంకరింత.

"బిడ్డా! గదిలో బంధించి కొడ్తే పిల్లి కూడా తిరుగబడి కను గ్రుడ్లను పీకుతది జాగ్రత్త" అని ఒక అతి ప్రమాద హెచ్చరిక.

వంగుతే ఎక్కుట.. ఎక్కుతే వంగుట.. సిద్ధాంతం.

చదువు మనిషికి ధైర్యాన్నిస్తుంది. జ్ఞానాన్నిస్తుంది. ఏ పరిస్థితులనైనా ఎదుర్కోగల విచక్షణతో కూడిన స్థైర్యాన్నిస్తుంది. అందుకే రెండేళ్లలో ఎం.ఫిల్

పూర్తి చేసి డాక్టరేట్ పట్టాకోసం.. ప్రవేశ పరీక్ష రాస్తూంటే.. మళ్ళీ గొడవ.

"నువ్విలా నాకంటే ఎక్కువ చదువుకుంటూ ఎదుగుతూ వెళ్తూంటే నా ఫ్రెండ్స్ నన్ను చిన్నచూపు చూస్తున్నారు. బంద్ చెయ్.." అని దబాయింపు.

"చేయను.. చదువుకుంటా.. జీవితాంతం చదువుకుంటా.. ఉద్యోగం కూడా చేస్తా."

"వీల్లేదు" అని చేతిలోని చెంబుతో విసుర్తే.. నొసలు చిట్లి.. రక్తం.. ఎర్రగా.

గాయమయ్యింది.. హాస్పిటల్.

ఇక మాటలు బంద్.. మౌనం మనుషులను శాశ్వతంగా దూరం చేస్తుంది. మనుషులు ఒట్టి నిమిత్తమాత్రులుగా మారి నీడలైపోతారు ఉనికిని కోల్పోయి.

ఒకే ఇంట్లో ఉంటారు. కాని మాట్లాడుకోరు.. సంబంధాలుండవు.. ఎవరికెవరు ఎవరో.

అన్నీ ఉన్నట్టే ఉంటూ ఏమీ లేని శూన్యస్థితి.

"మేడం..ఒడ్డుకొచ్చినం" అని రాములు అంటూంటే,

ఉలిక్కిపడి చూసింది అరుణ.. అంతా చీకటి చుట్టూ. రాములు చేతిలో ఓ మూడు వంద రూపాయల నోట్లు పెట్టి.. నడక.. ఇసుకలోనుండి.. రాళ్లపైనుండి.. ఇంకా చీకట్లోకి.

❄ ❄ ❄

బస్సు పోతూనే ఉంది చీకట్లో. కిటికీ దగ్గర కూర్చున్న అరుణ అలా చూస్తోంది బయటకు. అంతా చీకటి ఏమీ కనబడ్డంలేదు.

ఒక భార్య, ఒక భర్త.. రెండు జీవితాలు ఒక్కటై తాడులా పెనవేసుకుపోయి ఒక్కటిగా జీవిత భారాన్ని మోయవలసినవాళ్ళు..ప్చ్.

ఎందుకిలా.. తామిద్దరు ఇంత వైరుధ్య తత్వాలతో యాదృచ్ఛికంగా కలిసి.. భార్యాభర్తలై.. పొసగక నిరంతరం ఘర్షిస్తూ.. చివరికి ఒక అసంపూర్ణ చిత్రంగా వికృతమై మిగిలి, ముగిసి,

ఏమిటి కారణం ఈ స్థితికి?

కేవలం విధేనా. 'ఇలా జరుగవలసి ఉంది కాబట్టి జరిగింది'.. అంతే అన్న

వేదాంత తాత్విక ధోరణేనా సమాధానం దీనికి.

అకస్మాత్తుగా వర్షం మొదలైంది టపటపా పెద్ద పెద్ద చినుకులతో. పెద్దగా గాలి కూడా విసుర్తూ. గేల్.

సరిగ్గా ఆ రోజు కూడా ఇంతే. దాదాపు ఓ ఆరునెల్ల క్రితం.

జయరాం ఎంత శాడిస్ట్‌గా మారాడంటే.. హింస.. తనను హింసించడమే.. మానసికంగా, శారీరకంగా కూడా అతని దినచర్య. అంతకు ముందు రెండ్రోజుల క్రితం తీవ్రంగా కొడితే పోలీస్ స్టేషన్‌లో 'గృహ హింస' కేస్ పెట్టింది తను. అంతే తిక్క కుదిరింది. పోలీస్‌లు స్టేషన్‌కు పిలిపించుకుని లాకప్‌లో పెట్టారు. కాని వాడికో పాలసీ ఉంది. అంటాడు 'ఇది భారత దేశం.. ఇక్కడ డబ్బుతో దేన్నైనా, ఎవన్నైనా కొనవచ్చు' అని. అదే జరిగింది.

దర్జాగా ఆ అర్ధరాత్రి ఫుల్లుగా తాగి వచ్చాడింటికి. వస్తూ వస్తూ వెంట ఒక స్త్రీని తెచ్చుకున్నాడు. ఆమెను తన ఎదుటే నగ్నపర్చి రతి కార్యం మొదలుపెట్టి.. తనను చూడమని ప్రదర్శన. రాక్షసకేళి. బీభత్స విశృంఖలత. మానసికంగా శాడిస్ట్ హింస.

తను చూస్తూ కూర్చుంది చాలా సంయమనంతో అంతా.. ఆ వెకిలి చేష్టలను.

బయట వర్షం రాత్రంతా.. ఎడతెగకుండా.. భోరున.

బాధ, దుఃఖం ఒక హద్దు మీరిన తర్వాత మనిషి వాటికి ఇమ్యూన్నైపోయి అతీతుడై మొద్దుబారిపోతాడు. చలన రహితమైన నిశ్చల సమాధిస్థితి అది. లేదా దేన్నీ లెక్కచేయని అరాచకస్థితి అది.

ఆ తర్వాత బహుశా ఒక నెల తర్వాత.. మళ్ళీ అదే భీకరమైన వర్షం. పెనుగాలి. అంతా బీభత్సం. రాత్రి ఒంటిగంట దాటిందేమో ఎవరో అదే పనిగా తలుపులను బాదుతూంటే తెరిచింది తను. ఒక స్ట్రెచర్.. ప్రక్కన ముగ్గురు మనుషులు. స్ట్రెచర్‌పై తల పగిలి.. గుర్తు పట్టడానిక్కూడా వీలుగాని స్థితిలో శరీరమంతా రక్తమోడుతూ.. జయరాం శవం.

ఔటర్ రింగ్ రోడ్ ప్రక్కన ఒక ఫాంహౌజ్‌లో రాత్రంతా బాగా తాగి ఒళ్ళు తెలియని స్థితిలో మోటార్ సైకిల్‌పై రోడ్డు మీదికొచ్చి, 'వేగంగా వస్తున్న సిమెంట్ లారీని గుద్దుకుని ఇదిగో ఇలా.. అక్కడికక్కడే ఔట్.. జేబులో డ్రైవింగ్ లైసెన్స్‌పై అడ్రస్..." ఇంకేదో చెబుతున్నాడతను. అంతా అర్థమైంది అరుణకు.

అట్లాంటిదెప్పుడైనా జరుగవచ్చని తనూహించిందే.

వాళ్ళు వెళ్ళిపోయారు. ఆ రాత్రి తనూ.. జయరాం శవం అంతే.. మనసు ఒక చీము పట్టిన పుండులా సలిపి చితికిపోయింది. ఒక్క కన్నీటి చుక్క కూడా రాలేదు తనకు.

ఇక అంతా ప్రాసెస్. అత్తా మామ.. ఒక ఆడపడుచు. ఇద్దరు తమ్ములు. అందరూ తనపై దాడి.

శవసంస్కారమైపోగానే ఆస్తుల గొడవ. ఎవరికి ఏది దొరికితే దాన్ని అందుకుపోదామని ప్రయత్నం. కూపీలు లాగడం.

'మా కొడుకే పోయిన తర్వాత నువ్వెవతివే మాకు.. చలో గెటౌట్' అని సామూహిక దాడి.

కాని యుద్ధానికి సిద్ధమై ఉంది తను.

జయరాంతో పెళ్ళి ఎందుకు జరిగిందో తెలియదు.. అదో కలలా జరిగి.. తదనంతరం అంతా దుఃఖమే మిగిలింది. ఐదు జన్మలకు సరిపోయే హింసనూ, అవమానాలనూ సహించింది తను. ఇప్పుడు ఆ రాక్షసుని మరణానంతరం కూడా తనొక అమాయక అనాథై బేలగా మిగిలిపోదల్చుకోలేదు. అందుకే విజృంభించింది. అప్పుడా క్షణాల్లో తనకు అండగా నిల్చి ధైర్యాన్నిచ్చింది తన చదువు. తనకు జ్ఞానంవల్ల సంక్రమించిన తెలివి.

మొట్టమొదట డైరెక్ట్‌గా వెళ్ళి వ్యక్తిగతంగా కలిసింది జిల్లా కలెక్టర్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌లను.

ఎప్పుడైనా ఒక సామాజిక సమస్య ఏర్పడ్డప్పుడు విచక్షణతో ఆ సమస్యను పరిష్కరించగల వ్యక్తి, అధికారి ఎవరో గుర్తించి అతన్నే వెళ్లి కలువాలి.. అనే స్పృహ మనిషికి చదువువల్ల కలుగుతుంది. శత్రువును ఎప్పుడైనా తెలివితో వ్యూహంతో ఓడించాలి.

తర్వాత .. 'కంపాషనేట్ అప్పాయింట్‌మెంట్' కింద మృతుని కుటుంబంలోని ఒక వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం.

'జయరాం తమ్ముడే వారసుడు' అని పైరవీ.. 'నాన్సెన్స్.. నేను భార్యనున్నాను గదా' అని ప్రతియుద్ధం.

బస్సు పోతూనే ఉంది ఆ చీకట్లో.

అరుణకు తను జరిపిన సుదీర్ఘ ఒంటరి పోరాటం, యుద్ధం జ్ఞాపకమొచ్చి.. ఒళ్ళంతా జలదరించింది.. ఒకరకమైన అసహ్యం.. రోత.

కాని.. విధికృతంగా బలైపోతున్న తను.. తనను తాను నిలదొక్కుకుని.. తనను తాను నిర్మించుకుంటూ.. తన హక్కులు, తన గౌరవం, తన స్వాభిమాన రక్షణ.. వీటికోసం నిర్విరామ సంఘర్షణ.

క్రితం రోజే కలెక్టర్ చేతుల మీదుగా ప్రభుత్వ ఉద్యోగిగా నియామక పత్రాన్ని పొంది ఉద్యోగంలో జాయినై,

ఈ రోజు.. జయరాం అస్థిక నిమజ్జనం.

లీలగా తన వ్యూహం జ్ఞాపకమొచ్చింది అరుణకు.. జయరాంను గుద్దిన లారీ డ్రైవర్‌కు మూడు లక్షలు, పోలీసులకు రెండు లక్షలు, ఇతరేతర ఖర్చులు రెండు లక్షలు..

అన్నీ దీర్ఘకాలిక అజ్ఞాత ప్రణాళికలు. వ్యూహాలు. తప్పవు.. కొన్ని. 'మనపై ఒక భీకర జంతువు దాడి చేసి ప్రాణాలకే ముప్పు తెస్తున్నప్పుడు నిర్దాక్షిణ్యంగా దాన్ని హతమార్చడం కేవలం ఆత్మరక్షణ చర్యే కాకుండా యుద్ధనీతి కూడా.'

నీతి.. రీతి.. యుద్ధం.. వ్యూహం.. సహనం.. సంయమనం.. ప్రతిఘటన.. లొంగుబాటు.. అన్నీ సాపేక్షాలూ సందర్భోచితాలే.

ఏవీ శిలాక్షరాలు కావు.

అన్నీ మారేవే.. మార్చవలసినవే.. మార్పే జీవితం.. జీవితాన్ని నిర్మించు కోవడమే ఒక వ్యూహం.

ఆ చీకట్లో.. వర్షంలో.. బస్సు దూసుకుపోతూనే ఉంది. అరుణకు తెలియకుండానే నిద్ర పట్టేసింది గాఢంగా.